130 కోట్లా.. రాష్ట్ర భవిష్యత్తా?

మొదటిపేజీ తరువాయి...

నల్లమలలో మాత్రమే జీవవైవిధ్యం సంపన్నంగా ఉన్నదని తెలిపారు. రాడార్ స్టేషన్ కోసం 2,900 ఎకరాల అడవిని ధ్వంసం చేస్తే మూసీ నది ఉనికికే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. శుక్రవారం సోమాజీగూడలో పర్యావరణ వేత్తలు పురుషోత్తంరెడ్డి , బీవీ సుబ్బరావు, దొంతి నర్సింహారెడ్డి మీడియాతో మాట్లాడారు. దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రాడార్ స్టేషన్ అనుమతులను వెంటనే రద్దు చేసి, మూసీ నది పుట్టిన అనంతగిరి అడవులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఫార్మా, డిస్టిలరీ, టెక్స్‌టైల్ డైయింగ్ పరిశ్రమల వల్ల మూసీనది విపరీతంగా కలుషితమైందని ఆవేదన వ్యక్తంచేశారు. రాడార్‌ను దామగుండంలోనే ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. రాడార్ ఏర్పాటుకు దేశంలో 12 ప్రాంతాలను పరిశీలించాలని ప్రతిపాదనలున్నాయని, అన్నింటినీ వదిలేసి దామగుండంలో పర్యవరణాన్ని దెబ్బతీయడం సరికాదని అన్నారు. దామగుండంలో నేవీ ప్రతిపాదించిన రాడార్ స్టేషన్ 2010 నాటిదని, గత 14 ఏండ్లలో టెక్నాలజీ ఎంతో మారిపోయిందని చెప్పారు. కాబట్టి కాలంచెల్లిన సాంకేతిక పరికరాల కోసం అటవీ భూములు అప్పగించడం సరికాదని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా ఫార్మాసిటీ వద్దన్నదని, ఇప్పుడు పేరుమార్చి అమలు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక శ్వేతపత్రాలు విడుదల చేసిందని, అదే తరహాలో దామగుండంపైనా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

డబ్బుకోసం భవిష్యత్తును ధ్వంసం చేస్తారా?

రాడార్ స్టేషన్ కోసం దామగుండం అడవిని ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పగించొద్దని బీవీ సుబ్బరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేవీ అధికారులు ప్రభుత్వానికి ఇచ్చే రూ.130 కోట్లు కావాలో, తెలంగాణ ప్రజల భవిష్యత్తు కావాలో నిర్ణయించుకోవాలని తేల్చి చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే పర్యావరణ వేత్తలతో చర్చలు జరపాలని, తమ అభ్యంతరాలను స్వీకరించాలని కోరారు. ఈ సమస్య 2,900 ఎకరాల భూమికి సంబంధించినది మాత్రమే కాదని.. గాలి, నీరు, జీవవైవిధ్యం ఇలా అనేక అంశాలు దీనిలో ముడిపడి ఉన్నాయని తెలిపారు. లక్షల చెట్లను తొలిగించడం వల్ల జంట జలాశయాలకు వరద ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. ఓవైపు మూసీ నది పునరుజ్జీవం గురించి ప్రభుత్వం గొప్పగా చెప్తూ, మరోవైపు ఆ నది జన్మస్థానాన్ని ప్రమాదంలో పడేయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక నదిని పునరుద్ధరించాలంటే కొన్ని కిలోమీటర్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కాదని, నది పుట్టిన స్థానం నుంచి సముద్రంలో కలిసే ప్రాంతం వరకు దృష్టిపెట్టాల్సి ఉంటుందని చెప్పారు. 'నదిని పునరుద్ధరించడం అంటే గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లేలా పార్కులు నిర్మించడం కాదు. స్వచ్ఛమైన నీరు, చేపలు, ఇతర జంతువులతో జల జీవవైవిధ్యాన్ని కాపాడటం' అని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు అటవీ భూముల అప్పగింతకు సంతకాలు చేసిన చేత్తోనే శుక్రవారం చిత్తడి నేలల దినాన్ని నిర్వహించారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఒడిశాలో సహజ జలపాతాల అభివృద్ధికి రూ.350 కోట్లు ఖర్చు చేస్తున్నదని, అదే సమయంలో నదులు పుట్టిన దామగుండంలో అడవులను నరికి వేస్తున్నదని మండిపడ్డారు.

గంగ, యమున నదులు పుట్టిన ప్రాంతాల్లో పూజలు చేసి పాపాలు కడుక్కుంటున్నప్పుడు మూసీ పుట్టిన ప్రాంతాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రభుత్వాన్ని, ప్రజలను ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి ప్రశ్నించారు. గంగానది పుట్టిన ప్రాంతం చుట్టూ 150 కిలోమీటర్ల వరకు 'ఎకో సెన్సిటివ్ జోన్'గా ప్రకటించి, ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పర్యావరణ పరిరక్షణ కమిటీని (ఈపీఏ) ఏర్పాటు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చాక పర్యావరణాన్ని విధ్వంసం చేసే ఒప్పందాలపై సంతకాలు చేసిందని విమర్శించారు. వెంటనే రాష్ట్ర స్థాయిలో ఈపీఏ ఏర్పాటు చేయాలని, దామగుండం భూములను ఎందుకు నేవీకి అప్పగిస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనంతగిరి, నల్లమల, ఆదిలాబాద్ అడవుల్లో మాత్రమే జీవవైవిధ్యం ఉన్నదని, అలాంటి అడవులను రాడార్ స్టేషన్ కోసం తీవ్ర సమస్యలు వస్తాయని తెలిపారు. వెంటనే నేవీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

15 మంది బలైనా స్పందించరా?

మొదటిపేజీ తరువాయి...

'ప్రజాపాలన తెస్తామని అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన మీ ప్రభుత్వం ప్రజావ్యతిరేకిగా మారిపోయింది. అనాలోచిత విధానాలతో, ఒక హామీ అమలుచేసే హడావుడిలో మరో వర్గాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్న తీరు మీ పాలన వైఫల్యాన్ని కండ్లకు కడుతున్నది. అందుకు నిదర్శనమే.. రోజురోజుకూ తీవ్రమవుతున్న ఆటోడ్రైవర్ల సంక్షోభం. గత పదేండ్లు తెలంగాణలో సబ్బండ వర్గాలు సంతోషంగా ఉంటే.. మీ 55 రోజుల పరిపాలనలోనే అనేక వర్గాలు ఆగమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుపేద బడుగు, బలహీనవర్గాలకు చెందిన ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారు. ఇంతకాలం చెమటోడ్చి తమ కుటుంబాలను పోషించుకున్న ఆటోడ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అన్నమో రామచంద్రా అంటూ ఆవేదన చెందుతున్నారు.

15 మంది ఆటోడ్రైవర్ల ఆత్మహత్య

ఆటోలకు గిరాకీ లేకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియక ఇటీవలి కాలంలో ఏకంగా 15 మంది ఆటోడ్రైవర్లు రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే.. పరిస్థితి ఎంత చేజారిపోయిందో అర్థమైపోతున్నది. ఆటోలు ఎక్కే వాళ్లు లేక కుటుంబం గడవని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పిల్లల ఫీజులు ఎలా చెల్లించాలో అర్థంకాక మానసిక వేదన అనుభవిస్తున్నారు. కిరాయి ఆటోలు నడుపుకునే డ్రైవర్ల పరిస్థితి మరింత దుర్భరం. అద్దెకు తెచ్చిన ఆటో కిరాయి పైసలు కూడా రాకపోవడంతో.. ఇక బతుకు బండిని లాగేదెలా? అని లక్షల మంది ఆందోళనలో ఉన్నారు. అప్పు తెచ్చి ఆటోలు కొని నడుపుతున్న డ్రైవర్ల పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే గురువారం ఒక గిరిజన ఆటోడ్రైవర్ సోదరుడు బేగంపేటలోని ప్రజాభవన్ ముందు తనకు ఇంతకాలం బువ్వపెట్టిన ఆటోను చేతులారా తగలబెట్టుకున్న సంఘటన చూసి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి గుండె బరువెక్కింది. ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. సమస్య తీవ్రరూపం దాలుస్తున్న తరుణంలోనే మా పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కమిటీని వేశాం. ఆటోసంఘాలు, డ్రైవర్లతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాం. వాటన్నింటినీ ఒక నివేదిక రూపంలో తయారుచేసి మా పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పంపించాం. కానీ ఇప్పటివరకు మీ ప్రభుత్వం దానిపై స్పందించిన పాపాన పోలేదు.

6.50 లక్షల మంది ఆటోడ్రైవర్ల పక్షాన..

అన్నం పెట్టిన ఆటో ఆకలి మంటల్లో కాలిపోయిన ఉదంతాన్ని చూసిన తరువాతైనా.. పరిస్థితి తీవ్రతను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని, 6.50 లక్షల మంది ఆటోడ్రైవర్ల పక్షాన కోరుతున్నాను. మీ అనాలోచిత విధానాల వల్ల రెండు నెలలుగా ఉపాధి లేక రోడ్డున పడ్డ ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. అందుకే రాష్ట్రంలో ఉన్న ఆరున్నర లక్షల మంది డ్రైవర్లకు ప్రతి నెల రూ.10 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని బీఆర్ఎస్ పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. 15 మంది ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు కారణమైన ప్రభుత్వం వెంటనే వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరుతున్నాను.

ఫొటోలకే రాహుల్‌గాంధీ పోజులు

ఎన్నికల ప్రచారం సందర్భంగా రాహుల్ గాంధీ ఆటోలో ప్రయాణిస్తూ డ్రైవర్ల సమస్యలు తనకు తెలుసు అంటూ ఫొటోలకు పోజులిచ్చారు. ఆటోడ్రైవర్లతో సమావేశం పేరిట సీఎం రేవంత్‌రెడ్డి మీడియాలో వార్తలకు చూపిన తాపత్రయం, వారి సమస్య పరిష్కారానికి చూపలేదు. ఈ సమావేశం తర్వాత ఆటోడ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఆటోడ్రైవర్లను విస్తృతంగా వాడుకున్న కాంగ్రెస్ పార్టీ, తీరా గట్టెక్కాక వారి జీవితాలతో ఇలా చెలగాటమాడటం అత్యంత దుర్మార్గమైన చర్య. ప్రజాభవన్ అని పేరు మారిస్తే సరిపోదు. ఆచరణలో చిత్తశుద్ధి ఉంటేనే ప్రజలు హర్షిస్తారు. ప్రజల సమస్యలు విని పరిష్కరిస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రజాభవన్ ముందే ఆటోకు ఒక డ్రైవర్ నిప్పుపెట్టుకున్నా.. సీఎం ఇప్పటివరకు స్పందించకపోవడం దురదృష్టకరం. అందుకే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుక వినిపిస్తున్నాం. ఆటోడ్రైవర్లను అన్నివిధాలా ఆదుకోవాలని మా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్లతో కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం. ప్రభుత్వం మెడలు వంచి ఆటోడ్రైవర్లకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం' అని పేర్కొన్నారు.

క్రెడిట్ కొట్టేయడం కాంగ్రెస్‌కు అలవాటే: కేటీఆర్

'ఇప్పటికే 7 వేల ఉద్యోగాలిచ్చాం.. 15 రోజుల్లో 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేసే బాధ్యతను మా మంత్రి వర్గం తీసుకుంటుంది' అన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌ది తప్పుడు ప్రచారమని తిప్పికొట్టారు. '6,956 స్టాఫ్ నర్సులు, 15,750 పోలీస్ కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్‌ను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిచేసింది. ఎన్నికల కోడ్ కారణంగా ఫలితాలను విడుదల చేయలేకపోయాం. రిక్రూట్‌మెంట్‌తో ఏమాత్రం సంబంధం లేని కాంగ్రెస్ ప్రభుత్వం అంతా తామే చేశామని ప్రజలను మోసం చేయాలనుకుంటున్నది. మరి సిగ్గులేకుండా కొత్త సీఎం నోటి నుంచి ఇలాంటి అవాస్తవాలు మాట్లాడటం సిగ్గుచేటు. క్రెడిట్ కొట్టేయడంలో చోర్ కాంగ్రెస్ పార్టీకి ఇది మొదటి సారికాదు. చివరిది కూడా కాదు' అని రేవంత్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

రాడార్‌పై రణమే..

- కోర్టుల్లో పిల్స్, ప్రజా ఉద్యమాలు
- ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం
- సొంత జిల్లాకు అన్యాయం చేస్తున్న సీఎం
- చర్చావేదికలో అభిప్రాయపడిన వక్తలు

చర్చా వేదికలో నేవీ రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వక్తలు

పరిగి, ఫిబ్రవరి 2 : వికారాబాద్ జిల్లా దామగుండంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఓవైపు రాడార్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి భాగస్వామ్యం గల వివిధ ప్రభుత్వ శాఖలపై కోర్టుల్లో వేర్వేరుగా కేసులు, ఎన్జీటీలో కేసులతోపాటు ప్రజా ఉద్యమం ద్వారా ప్రభుత్వం మెడలు వంచేలా కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. నేవీ రాడార్‌తో సుమారు 40 నుంచి 50 కిలోమీటర్ల మేరకు రేడియేషన్ ప్రభావం ఉంటుందని పర్యావరణవేత్తలు చెప్తుండటంతో హైదరాబాద్‌కు సైతం ముప్పు పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. దామగుండంలో నేవీ రాడార్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ దామగుండం అడవి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'ప్రకృతి విధ్వంసం-పరిణామాలు'పై పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో శుక్రవారం చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్మన్ బీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన సాంకేతిక విజ్ఞానం ప్రజలకు ఉపయోగపడాలి కానీ, ప్రజల జీవితాలను నాశనం చేసేలా ఉండకూడదని సూచించారు. లక్షలాది చెట్ల నరికివేతతో కలిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వారందరినీ ఉద్యమంలోకి తీసుకురావాలని అన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

నేవీ రాడార్ ఫైల్ దుమ్ము దులిపి అనుమతి ఇచ్చామని చెప్పిన మంత్రి కొండా సురేఖ, ఆ వెంటనే బీఆర్ఎస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం తగదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ నాగేందర్‌గౌడ్ అన్నారు. నేవీ రాడార్ ఏర్పాటుపై ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విపరీతమైన ఆతృతతో ఉన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శివరాత్రి రోజు దామగుండం క్షేత్రానికి తీసుకురావడం ద్వారా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టులకు భయపడకుండా ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దామగుండం అటవీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. ఒకే ప్రాంతంలో అనంతగిరి-దామగుండం జంట అడవులు దేశంలో ఎక్కడా లేవని, అత్యంత చక్కటి వాతావరణం గల అడవి పరిరక్షణకు పోరాటం చేస్తామని అన్నారు. దామగుండం ప్రకృతి ప్రేమికులు సత్యానందస్వామి మాట్లాడుతూ.. నేవీ రాడార్ ఏర్పాటుతో రేడియేషన్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువత అవగాహన పెంపొందించుకొని ఉద్యమంలో కలిసి రావాలని కోరారు. రాడార్‌ను అడ్డుకోవడం ద్వారా నే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని నార్మాక్స్ మాజీ డైరెక్టర్ బీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

అనుభవ రాహిత్యంతో ఎడారిగా తెలంగాణ

- సీఎం రేవంత్‌కు, మంత్రికి ఇరిగేషన్‌పై అవగాహన లేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

మీడియాతో మాట్లాడుతున్న కేపీ వివేకానంద. చిత్రంలో శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అనుభవరాహిత్యంతో తీసుకుంటున్న నిర్ణయాలతో తెలంగాణ ఎడారిగా మారుతున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. కేఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులను చేర్చవద్దని బీఆర్ఎస్ నేతలు నెల రోజులుగా హెచ్చరిస్తున్నా.. మన ప్రాజెక్టులను బోర్డులో చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇరిగేషన్ శాఖ మంత్రికి మన ప్రాజెక్టులపై అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా.. కేఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులను చేర్చలేదని గుర్తుచేశారు. కేఆర్ఎంబీపై ఢిల్లీకి వెంటనే అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

Army College of Dental Sciences requires the following teaching staff :-
(a) Dental
(i) Dept of Oral & Maxillofacial Surgery
Prof & HOD-01, Reader 01, Sr Lecturer01
(ii) Dept of Prosthodontics - Sr Lecturer-01
(b) Medical
(I) Dept of Anatomy – Reader-01, Sr Lecturer – 01,
(ii) Dept of Pharmacology – Reader – 01,
(iii) Dept of Gen Surgery – Reader – 01
(iv) Dept of General Medicine - Reader - 01
Qualification as per DCI/MCI.
CV/ Application to be submitted as per format available in ACDS Website by 18 Feb 2024 at acds.careers@gmail.com.
For any queries contact Mobile No 8978575429